# కంచికి చేరిన కథ

"స్వాతి, స్వాతి ఎక్కడున్నావే. ఇలారా" గట్టిగా హాల్లోంచి కేక వేసింది వరలక్ష్మి.

డాబా మీద కూర్చుని నవల చదువుతున్న స్వాతి కథ మంచి సస్పెన్స్‌లో వుండటంవల్ల విసుగ్గా "ఏమిటమ్మా ఎందుకు" అంది అక్కడ నుంచే ఇంకాస్త గట్టిగా.

"బాగుంది నీ పుస్తకాల పిచ్చి. ఇరవై నాలుగ్గంటలూ అలాగే చదువుతూ ఉంటావ్ ఏముంటాయే వాటిల్లో! కాస్త ఆ నవల అలా పడేసి కిందికిరా పనుంది. అవి చదివితే కడుపు కూడా నిండిపోతుంది. ఇంక తిండికూడా అక్కర్లేదు. ఆ మాయదారి పుస్తకాలు తెప్పించకండి అంటే వినరు ఈయన."

"అబ్బ ఏమిటమ్మా నీ గోల. ఏమిటి పిలిచావ్ చెప్పు త్వరగా" మొక్కబడికి నించున్నట్లుగా ఉంది ముఖం.

కూతురి వంక ఎగాదిగా చూసి మొదలుపెట్టింది. "అమ్మమ్మ ఉత్తరం రాసింది. ఫణికి స్వాతినిస్తారా లేక ఇంకో సంబంధం చూసుకోమంటారా? ఎన్నాళ్ళు ఇలాగ ఇష్టం లేకపోతే చెప్పేయండి అని. నిజమే ఎందుకు తండ్రీ కూతుళ్ళిద్దరికి ముసుగులో






గుండవరపు రమా చంద్రశేఖర్

గుమ్మలాట ఎన్నాళ్ళు? మీ నాన్న రానీ ఇవాళ అటో ఇటో తేల్చేస్తాను. ఇప్పటికి మూడేళ్ళ నుంచి వాయిదా వేస్తూనే ఉన్నారు. వాడు దూరంగా హోటల్ కూడు తినలేక అవస్థలు పడుతున్నాడు. త్వరగా ఏదో ఒకటి చెప్పకపోతే ఎన్నాళ్ళు ఆగుతాడు వాడు మాత్రం." భర్త మీద కోపం కూడా స్వాతి మీదే చూపిస్తోంది ఆవిడ.

"కరెక్ట్ ... సరిగ్గా... యిదే నేనిప్పుడు చదువుతున్న నవల్లో ఘట్టం కూడా ఇదేనమ్మా. సస్పెన్స్ చదనీయకుండా కొంపలు అంటుకున్నట్లు పిల్చేసావ్ ఇందుకేనా? పాపం నవల్లో నాయకి రేవతి ఏం చెప్పేసిందో ఏమిటో కాస్త ఆగి పిలువకూడదూ?" బుంగమూతి పెట్టింది.

"నోరు ముయ్యవే పిచ్చి మొద్దూ. నీ పుస్తకాల గోల నీది. చూడమ్మా నీకు మామయ్యను చేసుకోవాలని లేదూ? చక్కగా మంచి ఉద్యోగం. బుద్ధిమంతుడూ. అందగాడు, ఇంతకంటే ఏం కావాలి చెప్పు పైగా చిన్నప్పటి నుంచి నువ్వు అంటే ఎంతో ప్రేమ. వాడి గుణం మనమంతా ఎరిగున్నదే. అలాంటివాడ్ని వదిలేసి మీ నాన్న నీకు వేరే ఇంజనీరునో, డాక్టరునో లేక బిజినెస్ వాడినో చేస్తానంటారు. వీడు మాత్రం ఉద్యోగంలో పైకి రాలేదా? అదిగాక ఈ రోజుల్లో పై అంతస్థులో ఉన్నవాళ్ళకి చెడు అలవాట్లు కూడా ఉంటున్నాయి. అన్ని వ్యసనాలు ఉన్న వాడితో ఆడది కాపురం చేయడం కష్టం. నా మాట విని ఫణిని చేసుకో. నిన్ను ప్రేమించే వాడ్ని చేసుకుంటే సుఖపడతావు. చెప్పు వాడంటే నీకు ఇష్టమే కదూ". అంది వరలక్ష్మి స్వాతి గడ్డం పట్టుకుంటూ.

"అబ్బ నాకేం తెలుసమ్మా. నాన్నగారిష్టం. నా మంచి చెడ్డలు. మనిద్దరికంటే నాన్నకే ఎక్కువ తెలుసు. నాన్నకు మాత్రం నాకు మంచి వరుడ్ని తేవాలని ఉండదా? నే పోతున్నా ఇప్పుడే నన్ను పిలవకు. నాన్న వచ్చాక నేనే వస్తాను". ఇంకో మాటకు అవకాశం ఇవ్వకుండా డాబా పైకి పరుగుతీసింది చిన్నపిల్లలాగ.

"ఏమిటో ఇరవై యేళ్ళు నిండుతున్నా ఇంకా చిన్నపిల్లలా ప్రవర్తిస్తుంది. బి. ఏ. చదివినా సరే తన జీవితం గురించి స్వంతంగా ఆలోచించదు. అసలు మూడేళ్ళ క్రితమే పెళ్ళి చేస్తే ఈపాటికి తల్లి అయ్యేది. నేనేదో తెలివి తక్కువదాన్నని కొట్టిపారేస్తారు గానీ, ఫణికి ఏం లోటు?" నీ తమ్ముడు కదా అని సపోర్టు చేస్తావ్. నీ తండ్రి కూడా మొదట్లో బుద్ధిమంతుడే. రాను రాను తాగి తందనాలాడి మీ అమ్మను ఎన్ని బాధలు పెట్టాడు. మొన్న మొన్నటి వరకూ మీ నాన్న బ్రతికినన్నాళ్ళూ మీ అమ్మ ఒక్క రోజు సుఖపడిందా? ఆ పోలికే నీ తమ్ముడికి వస్తే నా బంగారు తల్లి జీవితం ఏమైపోవాలి?" అంటారు. తండ్రి తాగుబోతు అయినంత మాత్రాన కొడుక్కూడా అవ్వాలని ఎక్కడుంది? స్వాతి పుట్టినప్పటినుంచి ఈ ఆలోచన తన మనసులో చేరింది. చక్కగా ఒక్కగానొక్క తమ్ముడు. ఫణి చిన్నతనంలో తను స్వాతిని కడుపుతో ఉన్నప్పుడు –

"ఒరే ఫణీ నాకు కాళ్ళు పట్టరా నీకు పెళ్ళానిస్తాను." అనగానే అదేదో తాయిలం అనుకొని గబగబా కాళ్ళు పట్టేవాడు బుద్ధిగా. అంత చిన్న వయసులోనే వాడి మనసులో ఆశ రేకెత్తించింది తను. భర్తతో ఆ మాటే అంటే నవ్వి వూరుకునేవారు.

సరదాగా ఫణిని 'ఒరే అల్లుడూ' అని పిలిచేవారు. తానెంతో మురిసిపోయింది. అలాంటిది తన తండ్రి తాగుబోతు అయి పేకాట మరిగి అమ్మని నానా హింసలు పెడుతుంటే కళ్ళారా చూసిన ఆయన మనసు మారిపోయింది. అప్పటినుంచి ఫణి పెళ్ళి విషయంలో ఉదాసీనంగా మారిపోయారు. ఫణికి ఉద్యోగం వచ్చినప్పుడు మొదటి నెల జీతంలో అక్కాబావలకు బట్టలు తీసుకువచ్చి ఇద్దరి ఆశీర్వాదం పొందాడు. అప్పుడు స్వాతిని చేసుకుంటానని అమ్మ పెళ్ళికోసం తొందర పెడుతోందని చెప్పాడు. వరలక్ష్మి భర్తతో చెపితే స్వాతికి బి. ఏ. అవుతే కాని చెయ్యను అన్నారు. ఇప్పుడు ఏ వంక పెడతారు? భగవంతుడా ఏం చేస్తావో నీదే భారం స్వాతిని తన భార్యగా వూహించుకుంటున్న ఫణి స్వాతికి వేరే సంబంధాలు చూస్తున్నామని తెలిస్తే ఏమైపోతాడు. వరలక్ష్మికి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఏమిటోయ్ లక్ష్మి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" గోపాలరావుగారి గంభీర స్వరంతో ఈ లోకంలోకొచ్చిన వరలక్ష్మి మౌనంగా ఇన్‌లాండ్ కవరు ఆయన చేతిలో పెట్టింది.

ఉత్తరం పూర్తిగా చదివిన గోపాలరావ్ ముఖం సీరియస్‌గా అయింది. "ఏదో ఒకటి చెప్పెయ్యండి. మీకిష్టం లేకుండా ఎన్నాళ్ళు దాగుడు మూతలు" వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అంది.

"చూడు లక్ష్మి. నీ, నా ఇష్టాలతో కాదు ఈ పెళ్ళి చేసుకొనేది స్వాతి. ముందు దాని ఇష్టం కావాలి. తెల్సిందా!"

"అవును మొదటి నుంచి మీరు దాన్ని భయపెడుతుంటే ఎలా చేసుకుంటుంది. తాగుబోతు, జూదగాడు అవుతాడని అస్తమానూ దాని దగ్గర అనడమే. వాడేమీ అంత మూర్ఖుడు కాడు. జీవితం పాడుచేసుకోడానికి. మనం పిల్లనివ్వకపోతే వాడికేం పెళ్ళాం దొరక్కపోదు. అంతే కాని మీ అమ్మాయి కోసం పెళ్ళి మానుకుంటాడని మాత్రం అనుకోకండి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభంలేదు. కాళ్ళ దగ్గరకు వచ్చిన సంబంధం కాలదన్నుకుంటే తర్వాత దాని తలరాత ఎలా వుంటే అలా జరుగుతుంది." విసురుగా నాలుగూ దులిపేసి వంట గదిలో కెళ్ళిపోయింది.


గోపాలరావ్ సన్నగా నవ్వుకున్నాడు. ఈ హడావుడికి స్వాతి క్రిందకు వచ్చింది. "స్వాతీ, ఇదిగో కాఫీ మీ నాన్నగార్కి ఇవ్వు". గట్టిగా అరిచింది వంట ఇంట్లోంచి వరలక్ష్మి.

"చూడమ్మా, మీ అమ్మ నా మీద కారాలు మిరియాలు నూరుతోంది" తమాషాగా అన్నారాయన.

స్వాతి వంటగదిలో కొచ్చింది. "ఏమే... నీకు వాడ్ని చేసుకోడం ఇష్టంలేదా చెప్పు. ఇవాళే ఉత్తరం వ్రాసి పడేస్తాను." కోపంగా అంది వరలక్ష్మి.

"నాన్నగారిష్టం అమ్మా" అనేసి గ్లాసు తీసుకుని హాల్లోకి వచ్చేసింది.

తండ్రి కూతుళ్ళిద్దరూ నవ్వుకుంటూ పేకాట ఆడుకుంటున్నారు. మధ్య మధ్య జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటూ. చిన్న పిల్లవాడిలా కేరింతాలు కొడుతూ ఆడుకొంటున్న భర్తను చూస్తే ఒళ్ళు మండిపోయింది. వారిద్దరి వంక కోపంగా చూస్తూ



చరచరా డాబా మీదకు వెళ్ళిపోయింది.

★ ★ ★

సంధ్యా సమయం. పిల్లగాలి ప్రియుని చేరే ప్రియురాలిలా ఉత్సాహంగా ఆనందంగా, హాయిగా వీస్తోంది. గాలికి తలలూపుతున్న చెట్లు ప్రేయసీ ప్రియులకు స్వాగతం చెప్తున్నట్లు ఉన్నాయి.

పక్షుల కిలకిలా రావాలు పెళ్ళింట్లో సన్నాయి మేళంలా ఉంది. అస్తమిస్తున్న సూర్యకాంతి శోభనపు పెళ్ళికూతురిలా సిగ్గుపడుతూ మెల్ల మెల్లగా పడమటి దిక్కుకు మరలిపోతోంది. ఎఱ్ఱ బార్డరు చీర ధరించిన కన్నెపిల్లలా ఆకాశం కళకళలాడుతోంది. ఆ చల్లగాలికి పరవశిస్తూ ఎయిర్ బాగ్ భుజం మీద వేలాడుతుండగా ఉత్సాహంగా, ఆనందంగా చురుగ్గా అడుగులు వేస్తున్నాడు ఫణి. స్వాతిని చూసి రెండేళ్ళయింది. స్వాతి పేరు తలుచుకోగానే అతని ఒళ్ళంతా పులకరించింది. ఇంక స్వాతి నా సొంతం కాబోతోంది అన్న అనుభూతికి అతని మనసు పరవళ్ళు తొక్కుతూంది. తను సడన్‌గా వెళ్తున్నాడు. అక్కా, బావ ఆశ్చర్యపోతారు. ఈసారి ఎలాగైనా సరే స్వాతిని పెళ్ళి చేసుకుని గానీ తను భోపాల్ వెళ్ళడు.

ఫ్రెండ్స్ అంతా వేళాకోళం చేస్తున్నారు. ఏమయ్యా ముదురు బ్రహ్మచారి పెళ్ళెప్పుడు చేసుకుంటావ్ అని. ఇంక బావ ఎన్ని అడ్డంకులు పెట్టినా స్వాతిని తన దాన్నిగా చేసుకోవాలి. యింకెన్నాళ్ళు? స్వాతిని ఒక్క క్షణం విడవకుండా ఆమెని వెంట పెట్టుకుని ఉండాలి. స్వాతితో ఈసారి చెప్పెయ్యాలి. మై స్వీట్ స్వాతీ ఇక నేను ఆగలేను. నిన్ను విడిచి వెళ్ళాలంటే బాధగా ఉంటోంది. నువ్వయినా మన పెళ్ళికి మీ నాన్నని తొందరపెట్టు అని. అయినా బావకు మాత్రం ఇష్టంలేక కాదు. స్వాతి ఒక్కగానొక్క కూతురు. పెళ్ళయితే స్వాతి దూరం అవుతుందని వాళ్ళ బాధ. అంతకన్నా ఏంలేదు. అందుకే పెళ్ళికి ఇన్నిసార్లు వాయిదా వేస్తున్నారు బావ అనుకుంటూ ఇల్లు చేరాడు.

"ఏవోయ్ ఫణి ఎప్పుడు రాక? ఇంత హఠాత్తుగా ఊడిపడ్డావ్". గోపాలరావ్ పిలుపుకు ఉలిక్కి పడ్డాడు. రెండేళ్ళ క్రితం కూడా అల్లుడూ అనే పిల్చిన బావ ఫణీ అంటున్నారేమిటి ... ఛీ ... అన్నీ తన వెధవ అనుమానాలు. వెంటనే సర్దుకుని

"ఏం లేదు బావా పని మీద ఈ వూరు వచ్చాను. చూసి పోదామని ఇటొచ్చాను". అంటూ అక్కడే కుర్చీలో కూర్చున్నాడు.

"ఇదిగో లక్ష్మి మీ తమ్ముడు వచ్చాడు. కిందకు రావోయ్." భార్య నుద్దేశించి కేకపెట్టారు.

వరలక్ష్మి గుండెలు ఝల్లుమన్నాయి. ఫణి వచ్చాడా? ఇంకేముంది ఈసారి తేల్చి చెప్పేస్తారు కాబోలు దేవుడా? అమాయకమైన ఫణి ముఖం కళ్ళ ముందు కదలాడగా కళ్ళు తుడుచుకుంటూ కిందకు వచ్చింది.

## కంచికి చేరిన కథ

"ఏరా ఫణీ అమ్మ బాగుందా? ఎప్పుడు బయల్దేరావ్? కాళ్ళు కడుక్కో, కాఫీ ఇస్తాను". తన ముఖ కవళికలు తమ్ముడు చూడకుండా గబగబా వంట గదిలో కెళ్ళిపోయింది.

గోపాలరావ్‌గారు పేక ఆడుతూనే ఒకటి అరా ప్రశ్నలు వేస్తున్నారు. తెల్లని చీరా జాకెట్‌తో తెల్లగా అందంగా పాలరాతి బొమ్మలా ఉంది స్వాతి. కోమలమైన సన్నని నడుముపై అందమైన నల్లని బారు జడ అటూ ఇటూ భారంగా కదుల్తోంది. వెనక నుంచి మలిచిన శిల్పంలా ముగ్ధలా కుందనపు బొమ్మలా ఉంది. ఈసారి ఫణి మరింత గట్టిగా నిర్ణయించుకున్నాడు. స్వాతిని ఈసారి ఎలాగైనా పెళ్ళాడాలి ధృఢంగా అనుకొంటూ బాత్ రూమ్ వైపు వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి గోపాలరావ్‌గార్కి అర్జంట్ పని తగిలి ఊరెళ్ళిపోయారు. రాత్రి భోజనాలు అయ్యాక డాబా మీద పక్కలు ఏర్పాటు చేసింది వరలక్ష్మి. వంటిల్లు సర్దుకుంటున్న అక్క దగ్గరే తచ్చాడుతున్న ఫణిని చూసి

"పైకి వెళ్ళరా స్వాతి కూడా అక్కడే ఉంది" అంది ఈ విధంగా అయినా స్వాతిని వీడే అడిగితే స్వాతి కాదనలేదేమో అన్న భ్రమతో.

చెప్పిందే తడవుగా ఒక్కసారి గదిలోకి వచ్చి అద్దంలో ముఖం చూసుకొని దువ్వెనతో తల దువ్వుకుంటూ హుషారుగా ఈల పాట పాడసాగాడు. చల్లని వెన్నెల పిండారబోసినట్లుంది. ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో టేబుల్ లైట్ కాంతిలో నవల చదవటంలో నిమగ్నమై ఉన్న స్వాతి. ఒక ప్రక్క నుంచి చూస్తే స్వాతి ముఖం ఇంకా అందంగా ఉంటుంది. కోటేరులాంటి ముక్కు మరీ సన్నగా ఉంది. నల్లని కనురెప్పలు హరివిల్లులా వంగి ఉన్నాయి. సన్నని లేత తమలపాకుల వంటి చెంపలు చిలిపిగా కవ్వించే అందమైన ఎఱ్ఱని పెదవులు చుట్టి న్నాయి. స్వాతి పెద్ద పిల్లయినప్పటి నుంచి ఒంటరిగా మాట్లాడాలంటేనే బెరుగ్గా ఉంటుంది. అటువంటిది ఈ పెళ్ళి విషయం ఎలా చెప్పాలి?

"మామయ్యా నువ్వా? ఎంతసేపయింది వచ్చి? భోజనం అయిందా? నేను నవల చదువుతూ భోజనమే చెయ్యలేదు. అమ్మ తిడుతోందో ఏమో?" అంది స్వాతి.

"ఏం నవల అది" యధాలాపంగా అడిగాడు ఫణి.

"కంచికి చేరని కథ. చాలా బాగుంది మామయ్యా. నువ్వు చదువుతావా?"

"ఛీ ఇదేం పేరు. అపశకునంలా' మనసులో అనుకున్నాడు. గొంతు సవరించుకుని మెల్లగా అసలు విషయం అడగాలనుకుంటూ స్వాతి వంక చూశాడు. సరిగ్గా స్వాతి కూడా ఫణి వంక నిశ్చలంగా చూస్తోంది. ఇద్దరి చూపులూ ఒక్కసారిగా కలుసుకున్నాయి. ఫణి చూపులో చిక్కుకున్న చూపును ఛటుక్కున మరల్చుకుంది స్వాతి.

"స్వాతీ ... నేను ... నేనంటే నీకెలాంటి అభిప్రాయం ఉంది. నన్ను పెళ్ళి చేసుకోటానికి నీకేమైనా అభ్యంతరమా? అలాంటివేమీ ఉండవనుకో. కానీ ఒక్కసారి నిన్ను అడిగేస్తే ముహూర్తాలు పెట్టించేయచ్చు అంటోంది మా అమ్మ" అన్నాడు నెమ్మదిగా.

స్వాతి గుండె ఒక్కసారి లయ తప్పింది. అప్రయత్నంగా అతని వంక చూసింది. విశాలమైన ఆ కళ్ళనిండా విపరీతమైన ఆరాధనా, ప్రేమా నిండి ఉన్నాయి. పట్టుదలను సూచించే ఆ ముక్కు ఉంగరాలు తిరిగి అందంగా ఉన్న జుత్తు, కొద్దిగా లావుగా ఉన్నా అందమైన పెదవులు బెంగాలీ నవల్లో హీరోలా ఉన్నాడు. స్వాతి చెప్పబోయే జవాబులో తన జీవితం ఇమిడి ఉందని అతని ముఖ కవళికలు చెప్తున్నాయి. జాలిగా ఆర్తిగా ఉన్నాయి ఆ కళ్ళు. అమాయకమైన అతని ముఖంలో ఆ కళ్ళే విపరీతమైన ఆకర్షణ. ఒక్కసారి అతడ్ని దగ్గరకు తీసుకోవాలని నువ్వు నా వాడివే అని చెప్పాలని అనిపించింది. మొదటిసారిగా ఆమెలోని స్త్రీత్వం మేల్కొంది.

"ఏమిటి స్వాతీ మాట్లాడవ్. ఇందాక బానే ఉన్నావ్. సడన్‌గా మూగదానివి అయిపోయావ్ ఏమిటి. నేనంటే సిగ్గా? లేక భయమా? నేనంటే ఇష్టంలేదా? చెప్పు స్వాతీ ప్లీజ్! ... టెల్ మి. నువ్వంటే చిన్నప్పటినుంచి నాలో తెలీకుండానే ప్రేమ పెరిగింది. నా హృదయంలో ఊహ తెలిసినప్పట్నుంచి నీ రూపాన్నే ఆరాధిస్తూ వచ్చాను. యిక ఈ మూగప్రేమ ఎంతకాలం ఈ గుండెల్లో దాచుకోను?" బేలగా అమాయకంగా అడిగాడు.

తను అతని అర్ధాంగి అయితే జీవితంలో ఇంకేమి అక్కర్లేదు అన్నట్లు ఉన్నాయి అతని చూపులు. ఇంత పిచ్చిగా తనను ప్రేమిస్తున్న ఫణికి భార్యనయితే జీవితమంతా అతని ఆరాధనలో నిశ్చింతంగా గడిచిపోతే? త్రుళ్ళిపడింది వద్దు. వద్దు. తను చదివిన నవల్లోని రేవతి పాత్ర సరిగ్గా ఇలాంటిదే. బావ ప్రేమలో పడి తండ్రి వద్దంటున్నా వినకుండా అతడ్ని పెళ్ళాడి జీవితం నరకం చేసుకుంది. తండ్రి ఆమె భవిష్యత్ నందనవనంగా చెయ్యాలని కలలు కన్నాడు. అవన్నీ కల్లలు అయిపోగా కూతురి నరకంలాంటి జీవితం చూడలేక గుండె ఆగి మరణిస్తాడు. మనసు పడి మనువాడిన బావ తండ్రి గుణాలు పుణికి పుచ్చుకుని రేవతిని నానా హింసలు పెడుతుంటే చివరకు ప్రాణత్యాగం చేసుకుంటుంది.

అది నవల కాబట్టి సరిపోయింది. నిజ జీవితంలో అలా ఐతే తను ఆత్మహత్య చేసుకోగలదా? అచ్చం ఫణి తాతయ్య పోలిక. అదే ముఖం. అవే కళ్ళు. వద్దు నేను ఫణిని చేసుకోను. నాపై ఎన్నో ఆశలు పెట్టుకుని నన్ను గొప్పగా వూహించుకుంటున్న

నాన్న ఆశలు తుంచలేను. చెప్పేస్తాను. ఫణీ నిన్ను చేసుకోలేను అని. తాతయ్య బ్రతికినన్నాళ్ళు అమ్మమ్మకి రోజూ ఏడుపే. అమ్మమ్మ ఏడుస్తూ అమ్మకి, నాన్నకి తన గోడంతా చెప్పుకుంటుంటే తను భయంతో వణికిపోయేది. ఏ ఆడదానికి అంత ఘోరమైన జీవితం వద్దు భగవంతుడా అనిపించేది.

తాతయ్య కూడా మొదట్లో అమ్మమ్మను ప్రేమగా చూసుకునేవాడు. తర్వాత మారిపోయాడు. అలాగే ఫణికూడా ఉంటే? అమ్మా నాన్న చూడగలరా? చూస్తూ చూస్తూ నిండు ప్రాణాన్ని బలి చేసుకోగలదా తను ... నో ... నాకెంతో ఫ్యూచర్ ఉంది. మంచి భర్త, సంసారం, మూడు పువ్వులు ఆరు కాయలుగా, అణుకువగా మంచి ఇల్లాలుగా పేరు తెచ్చుకోవాలి. అంతేకానీ భర్త పోరు పడలేక ఆత్మహత్య చేసుకొనే భార్యలాగ కాదు. ధృఢంగా, నిశ్చలంగా, నిర్భయంగా ఫణి వంక చూస్తూ

"సారీ మామయ్యా నన్ను క్షమించు. నేను ... నేను నిన్ను పెళ్ళి చేసుకోలేను. నన్ను దయచేసి వివరాలేమీ అడగొద్దు. నువ్వు వేరే మంచిపిల్లను చూసి చేసుకో. నన్ను ... నన్ను ... ఈ దుర్మార్గురాలిని మర్చిపో. మన్నించు. నాకు తెలీకుండా నీలో ఆశలు పెంచి ఉంటే క్షమించు." ఉబికి వస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూ గబగబా మేడ దిగిపోయింది.

ఒక్కసారిగా షాక్ తిన్నట్లు అయిపోయాడు ఫణి. అతడికి భూమి, ఆకాశం ఏకమైనట్లు, లోకం అంతా గాఢాంధకారం అలుముకున్నట్లు నెత్తిన పిడుగులు పడ్తున్న అనుభూతితో తల రెండు చేతుల్తో పట్టుకుని కూర్చున్న ఫణి తను కూర్చున్న కుర్చీ కూడా భూమిలోకి కూరుకుపోతున్నట్లయి చటుక్కున లేచి పిట్టగోడ ఆసరాతో నిలబడ్డాడు. తను విన్నది నిజమా? ఇప్పుడు స్వాతి ఏం చెప్పింది. ఈ పెళ్ళి ఇష్టం లేదా? ఇన్నాళ్ళు స్వాతి తనదేనన్న భ్రమతో ఎంత మోసపోయాడు. ఛీ ... తప్పంతా తనదే. స్వాతిని సూటిగా ఏనాడు అడగకపోవటం తనదే పొరపాటు. కలలో కూడా స్వాతి నిరాదరణ ఎరుగని ఫణి అయిదు నిమిషాల్లో పది లంకణాలు చేసినవాడిలా ఉన్నాడు. ఆ క్షణంలో అతడికి రక్త ప్రసరణ ఆగిపోయి ప్రాణం పోతే బాగుండు ననిపించింది. కరువుతీరా ఏడవలేని తన బలహీనతకు తన మీద తనకే జాలేసింది.

క్రిందకు వచ్చి బాగ్ సర్దుకుంటున్న తమ్ముడ్ని చూసి విషయం గ్రహించింది వరలక్ష్మి. ఏమనాలో తెలియక కొయ్యబొమ్మలా నిలబడిపోయింది. స్వాతి గది తలుపులు వార్లేసి ఉన్నాయి. లోపల లైటు వెలుగుతోంది. బహుశా ఏ నవలో చదువుకుంటోంది కాబోలు. వరలక్ష్మి మనసు సిగ్గుతో అవమానంతో చితికిపోయింది. గబగబా ఫణి దగ్గరకు వెళ్ళి

"ఏమిట్రా బట్టలు ఎందుకు సర్దుకుంటున్నావ్". గాభరాగా ప్రశ్నించింది. ఆవిడ కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయ్.

"నేను వచ్చిన పని అయిపోయిందక్కా. బహుశా నా రాక ఇదే ఆఖరిసారి కావచ్చు. ఇంకేమీ చెప్పలేక పోతున్నందుకు క్షమించు."

తలొంచుకొని అతి కష్టంగా అంటున్న తమ్ముడికేసి చూస్తే ఆవిడ ప్రాణంవిలవిల్లాడింది. ఆమెలో సోదర ప్రేమ ఒక్కసారిగా వెల్లువలా పొంగింది. "ఒరే ఫణీ ఎందుకురా నన్ను అంత చిత్రహింస పెడతావ్, నాకు అంతా తెలిసింది. నాలుగు రోజులు ఆగు. ఈలోగా స్వాతి మనసు మారుతుంది. అదింకా చిన్నపిల్ల. తెలివితేటలు లేవు. నా మాట విను. స్వాతిని ఒప్పించే పూచీ నాది." ఏడుస్తూ అంది.

"హుఁ ... అవునక్కా స్వాతి చిన్నపిల్లే. అస్సలు ఏం తెలీదు. ఎదుటి వారి మనసును మాటలతో చిత్రవధ చెయ్యడం తప్ప ఇంకేం తెలియదు. ఇంకేమిటి అన్నావ్? తెలివితేటలు లేవని కదూ! అందుకే గ్రాడ్యుయేట్ అయింది. తన జీవితాన్ని స్వతంత్ర్యంగా నిర్ణయించుకోగలిగింది. ఇంకా ఏమిటి అన్నావ్? నాల్గు రోజు లాగితే స్వాతిని చెప్పిస్తావా? ఎంత పిచ్చి దానివక్కా? స్వాతికి అసలే నేనంటే ఇష్టంలేదు. నువ్వు మాత్రం ఏం చేయగలవు. నా అదృష్టం యింతవరకే రాసిపెట్టి ఉంది. అయినా సిఫార్స్ చేసి ఈ పెళ్ళి అంత బలవంతంగా జరిపించడం ఎందుకులే అక్కా? నన్ను పోనియ్. బావగారి ఉద్దేశ్యం కూడా నాకు ఇందాక అర్థం అయ్యింది. నాకు స్వాతినివ్వడం లేదని నేను రాగానే నన్ను పిలిచిన పిలుపులో నే అర్థం చేసుకున్నానక్కా. నేనంత తెలివి హీనుడ్ని కాను. ఆ తండ్రీ కూతుళ్ళ భావాలు అర్థం చేసుకోకపోవటానికి. కాకపోతే ఈ పిచ్చి మనసును అదుపులో పెట్టుకోలేక, మనసులో పీకుతున్న ఆశ చంపుకోలేక స్వాతిని అడిగి లేదనిపించుకున్నాను. నువ్వేం బాధపడకక్కా. చిన్నప్పట్నుంచి నన్ను నీ దగ్గరే ఉంచుకోవాలని కలలు కన్నావ్ కదూ! నీ కలలు నెరవేర్చలేకపోయిన దౌర్భాగ్యుడ్ని క్షమించక్కా". కళ్ళలోంచి కారుతున్న కన్నీళ్ళు తుడుచుకోకుండానే, అక్కా పిలుస్తున్నా వినిపించుకోకుండానే బాగ్ భుజానికి తగిలించుకుని వడివడిగా చీకట్లో కలిసిపోయాడు ఫణీంద్ర.

వెక్కి వెక్కి ఏడుస్తూ సోఫాలో కూలబడింది వరలక్ష్మి. ఇంక వాడు చచ్చినా తిరిగి రాడు. వాడి పట్టుదల, అభిమానం చిన్నపట్నుంచి తను ఎరిగింది కదూ. దౌర్భాగ్యురాలిని నేనే వాడికి ఆశలు కల్పించాను. భగవంతుడా! నేనేం పాపం చేశానని నాకీ శిక్ష విధించావ్. ఉన్న ఒక్కగానొక్క తమ్ముడు, అక్కయ్యకు ఏ ప్రమాదం జరిగినా భరించలేని వెర్రి వెధవ. అక్కయ్య మీద ఈగ వాలినా భరించలేని తమ్ముడు ఇంక నాకు లేడు. ఈ కొంపలో నేను చచ్చిపోయినా సరే ఇంక అడుగుపెట్టడు వాడు.

తన గదిలో కూర్చుని అప్పటి వరకూ జరిగినదంతా వింటూ వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ నానా ప్రయాసపడుతోంది స్వాతి. "నా కసలు ఒకే మామయ్యను ఎందుకిచ్చావ్? దేవుడా!పోనీ మామయ్యనిచ్చినా అతన్ని ఇంత అమాయకంగా, మంచివాడుగా ఎందుకు పుట్టించావ్. నాకు ... నాకు ... మామయ్యను ప్రేమించే హృదయం ఎందుకు ఇవ్వలేదు. భగవంతుడా! మామయ్య ... యింత మంచి మనస్సున్న మామయ్యకు అన్యాయం చేయకు. అతడి జీవితం మరోకరితో బాగుపడేలా చెయ్యి స్వామీ". మనసులో నే దేముడ్ని ప్రార్థించింది. ఇంకా తన గదిలోకి వస్తాడని, 'ఎందుకు నేనంటే ఇష్టంలేదు' అని నిలదీస్తాడని, కోపంతో శపిస్తాడని అనుకున్న స్వాతి మనసు తేలిగ్గా నిట్టూర్చింది. క్షణంలో తన ప్రాబ్లమ్ సాల్వ్ అయ్యేసరికి ఒక్క


**నెలకు రు. 1500 సంపాదించండి**

ఎలెక్ట్రికల్ గైడు రు. 15, రేడియో గైడు రు. 30, ఫొటోగ్రాఫ్ రు. 15, వివాహ జీవితము 100 బొమ్మలతో సహా రు. 15, మెడికల్ సెక్సుగైడు 188 బొమ్మలతో సహా రు. 20, టైలరింగు & కట్టింగు రు. 15, డ్రాయింగు & పెయింటింగు రు. 15, 300 కుటీర పరిశ్రమ గైడు రు. 35, ట్రాన్సిస్టర్ రేడియో గైడు రు. 15. పోస్టేజి రు. 3 అదనము. ప్రతి ఒకటికి అడ్వాన్సుగా మనియార్డరు పంపవలెను.

**GEETA PUBLICATIONS** (A.V.)
(M.C. 36) Aligarh.



**B.A./B.Com., ఎంట్రన్స్**
ఆంధ్రా/ఓపెన్ యూనివర్శిటీ

ఏ విద్యార్హతా లేకుండా 20సం॥లు నిండినవారు ఒక్క సంవత్సరములో 'ఎంట్రన్స్'వ్రాసి B.A./B.Com.,ఇంగ్లీషు/తెలుగు మీడియంలో చదువవచ్చును అమ్మనవ పోస్టల్/ఓరల్ శిక్షణ తేలిక పద్ధతిలో వ్రాయబడిన నోట్సు తక్కువఫీజు వివరములకు ప్రాస్పెక్టస్ రు 5/- M.O

డైరెక్టర్: ఫోన్:3803
**శ్రీలక్ష్మి ట్యుటోరియల్స్**
తెనాలి-522201.(A.P.)



**ఆంధ్రపత్రిక**

దినపత్రికలో

* మన సినిమాలు
* వింత యదార్థం

శీర్షికలు చూస్తున్నారా?

క్షణం రిలీఫ్‌గా ఫీలయ్యింది. కానీ మరుక్షణంలోనే ఏదో తెలీని ఆవేశంతో, బాధతో గుండెల్లో మంట రగిలి తనకు తెలీకుండానే మంచం మీద పడి పిచ్చిగా, కరువుతీరా వెక్కి వెక్కి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది.

*  *  *

కాలం ఎవరి కోసం ఆగదు. గిర్రున నాలుగు సంవత్సరాలు కాలప్రవాహంలో తిరిగిపోయాయి. ఫణి పెళ్ళికోసం కలవరించిన ఫణి తల్లి కోరిక తీరకుండానే కాలం చేసింది. స్వాతిని గొప్ప బిజినెస్ మాగ్నెట్‌కిచ్చి పెళ్ళి చేశారు గోపాలరావ్. ఫణి భోపాల్ వెళ్ళిపోయాడు. ఆనందంగా, ప్రశాంతంగా సాగిపోతున్న స్వాతి జీవన వీణపై రాను రాను నెమ్మదిగా అపశ్రుతులు పలుకసాగాయి. సుధాకర్‌కి తాగుడు అలవాటు ఉందని తెలిసిన మొదటి రోజు తండ్రితో ' చెప్పి బావురుమంది స్వాతి. "ఫరవాలేదమ్మా అతడు పెద్ద పొజిషన్‌లో ఉన్నవాడు కంపెనీ కోసం తాగుతాడు. అది అలవాటుగా మారకుండా చూసుకో" అని ఓదార్చాడు.

అతను క్లబ్బుల్లో పేకాట, రేసులకి వెళ్తాడని తెల్సిన రోజు గుండె బ్రద్దలు అయ్యేలా ఏడ్చింది. 'భగవంతుడా నేను ఏది వద్దనుకుని ఫణిని కాలదన్నుకున్నానో అదే నా పాలిట శాపమై నన్ను వెంటాడుతోంది. సుధాకర్‌కి గాళ్ ఫ్రెండ్స్ కూడా ఉన్నారని తెలిసేసరికి ఆమె గుండె బండబారిపోయింది. యిక ఏడవటానికి ఆమె కళ్ళలో నీరుకూడా ఇంకిపోయింది. తనను గురించి బంగారు కలలు కన్న తండ్రి ఆ కలలు నిజం కాకుండానే సడన్‌గా ఆఫీసులోనే గుండె ఆగి మరణించినపుడు కుమిలి కుమిలి ఏడ్చింది. ఆ రోజు ఎంత దయనీయంగా అడిగాడు ఫణి తనను చేసుకొమ్మని తను నిర్దాక్షిణ్యంగా ఫణిలాంటి మంచివాడ్ని ఎట్లా కాలదన్నుకుంది. తనకి శాస్తి జరగాల్సిందే ... తనీ నరకం అనుభవించాల్సిందే. తన జీవితాన్ని చేతులారా నరకం చేసుకుంది తనే. ఈ శిక్షతో తను చస్తూ, బ్రతుకుతూ జీవచ్ఛవంలా బ్రతుకంతా ఏడవాలి కేవలం పుస్తకాల భ్రమతో, నవలలోని పాత్రతో తనను పోల్చుకుని, తనను పిచ్చిగా ఆరాధించిన మామయ్యను, పువ్వుల్లో పెట్టి పూజించ వచ్చిన వ్యక్తిని కాలరాసింది. యిది ... యిది ... ఫణి తనకిచ్చిన భయంకరమైన శాపం.

తను అతనికి చేసిన ద్రోహానికి తగిన ప్రాయశ్చిత్తం. ఫణీ నువ్వు ఆ రోజు మౌనంగా, మరలిపోయావే కానీ, నన్ను నీ యిష్టం వచ్చినట్లు తిట్టి శాపనార్థాలు పెట్టి, అఖరికి బలవంతంగానైనా నీ దాన్నిగా ఎందుకు చేసుకోలేకపోయావ్? అప్పుడు నాకీ శాపం తగిలేదా? నా జీవితం ఇలా అయ్యేదా? అమ్మా నీ తమ్ముడి కోసమే కదమ్మా నన్ను కన్నావ్. అయితే బలవంతంగా నా నోరు నొక్కేసి మీ తమ్ముడికే నన్ను పెళ్ళి చేయలేకపోయావా? నన్ను

> ## మర మనుషుల రెస్టారెంట్
>
> పూర్తిగా మరమనుషుల చేత నిర్వహింపబడే రెస్టారెంట్ ఈ సంవత్సరాంతంలోగాని, వచ్చే సంవత్సరం ఆరంభంలోగాని న్యూయార్క్‌లో ప్రారంభం కానున్నది.
>
> 'మాడ్యులర్ రోబట్' ను విజయవంతంగా ప్రదర్శించిన తరువాత హ్యాస్ ఇంటర్నేషనల్ సంస్థ దీని నిర్మాణాన్ని తలపెట్టింది. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం మేరీలాండులో ఉన్నది.
>
> ఈ రెస్టారెంట్‌లో మనుషుల వలె తలలు, చేతులు గల మరమనుషులు ఉంటారు. ఈ మరమనుషులే ప్రజలనుండి ఆర్డర్లను స్వీకరించి, వండి, వడ్డించి, డబ్బులు తీసుకుని, చిల్లర ఇచ్చి చిరునవ్వుతో ధన్యవాదాలు తెలుపుతారు!
>
> పూర్తిగా యాంత్రికమైన ఈ కొత్త తరహా రెస్టారెంట్ వేలాదిమందిని ఆకట్టుకోగలదని దాని యజమానులు ఆశిస్తున్నారు.

## కంచికి చేరిన కథ

పల్లెత్తు మాట అనకుండా గారంగా పెంచావ్. వయసు వచ్చాక స్నేహితురాలిలా ఆదరించావ్. అటువంటిది నీ గుండెల్లో తీరని మంట రగిలించాను. ఒక్కగానొక్క కూతురి జీవితం ఇలా అయిందని ఏడుస్తున్నావా అమ్మా? నా బ్రతుకు నేనే ఇలా చేసుకున్నాను. నా మీద నాకే జాలి, నా మీద నాకే అసహ్యం కలుగుతున్నాయమ్మా.

పాపం నాన్న మాత్రం ఏం చేస్తాడు? కూతురుని ఎంత గొప్ప వాడికిస్తే అంత గొప్పగా సుఖపడుతుందని వెదికి వేసారిపెద్ద బిజినెస్‌వాడిని కొనుక్కొచ్చి నాకిచ్చారు. నా తలరాత ఇలా బద్దలు అవుతుందని నాన్న మాత్రం అనుకున్నారా? ఈ లోకంలో ఉండి ఈ బాధలు చూడకుండా హాయిగా నాన్న వెళ్ళిపోయారు కదూ? 'ఫణీ వచ్చే జన్మ అంటూ ఉంటే నీ భార్యగా జీవించే అదృష్టాన్ని ప్రసాదించు. ఈ జన్మకు ఈ నిర్భాగ్యురాలిని మన్నించు. ఫణీ నీకు చేసిన అన్యాయానికి ఆ దేవుడే నాకీ శిక్ష విధించాడు. వచ్చే జన్మలో నీ పాదాలన్ను పూజించే దాసిగానైనా నన్ను ... నన్ను ఉండనిస్తావా? ఫణీ ... మామయ్యా ... ఒక్కసారి కనిపించు. మనసారా నిన్ను క్షమించమని అడగాలి. నా కనీళ్ళతో నీ పాదాలు కడగాలి. నిజంగానే నిన్ను ప్రేమించిన నా మనసును చంపుకుని కేవలం నవలలో పాత్ర నూహించుకుని నిన్ను కాలదన్నాను. అందుకే మామయ్యా! నువ్వంటే నా ప్రాణం అని నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించానని చెప్పాలి. ఎట్లా ... నిన్నెక్కడ కల్సుకోను ఈ నిర్భాగ్యురాలిని క్షమించి ఒక్కసారి కనపడవూ? ఫణీ ... ఫణీ ... మామయ్యా ...

వెర్రి కేకలు పెడ్తూ వెక్కి వెక్కి ఏడుస్తున్న స్వాతి ఒక్కసారిగా త్రుళ్ళిపడి ఈ లోకంలోకొచ్చింది.

"ఏమిటి స్వాతీ. ఏమిటలా అరుస్తున్నావ్? కలగన్నావా? ఆమె తలను రెండు చేతుల్లో పట్టుకుని అడుగుతున్న ఫణి వంక నిశ్చలంగా చూసి కళ్ళు గట్టిగా నలుపుకుని.

"మామయ్యా నువ్వు వెళ్ళిపోలేదా, నేను ... నేను ... నాకు పెళ్ళికాలేదా? నాన్న ఏరి" వెర్రిగా అడుగుతూ మెడ తడుముకుంది. "మామయ్యా నన్ను వదిలి వెళ్ళద్దు. నేనొక ఫూల్‌ని మామయ్యా ... నేను నిన్ను తప్పకుండా పెళ్ళి చేసుకుంటాను. నన్ను వదిలి నువ్వెక్కడికి పోవద్దు ప్లీజ్ మామయ్యా". పిచ్చిదానిలా ఏడుస్తూ ఫణి గుండెల్లో తల దాచుకుంది స్వాతి.

"పిచ్చి స్వాతీ, నువ్వు వద్దన్నంత మాత్రాన నిన్ను వదులుతాననుకున్నావా? చిన్నప్పటి నుంచి ఈ గుండెల్లో దాచుకున్న ఈ ప్రేమను ఎలా మర్చిపోతాను. నేను బస్టాండుకు వెళ్ళేసరికి ఆఖరి బస్సు మిస్సయ్యాను. నీకు నేనంటే ఎందుకిష్టంలేదో? వివరాలు అడగొద్దు అన్నావ్. అందుకే తెలుసుకోవాలని. అదికాక మా అమ్మ ఇంటి కోడలుకు అని దాచుకున్న నగలు పెళ్ళిలో పాతవి చెరిపించి నీ ఇష్టం వచ్చిన రీతిలో చేయించుకోమంది. నన్ను చేసుకోకపోయినా ఇక నాకు భార్య అంటూ ఈ జన్మకు లేదని, నిన్ను మరిచి వేరొకరిని చేసుకోవడం ఈ జన్మకు వీలుకాదని చెప్పి ఈ నగలు నీకే యిచ్చి వెళ్దామని వెనక్కు వచ్చాను. నా అదృష్టం వల్ల బస్సు మిస్సయ్యాను. కానీ జీవితంలో అతి ముఖ్యమైన నిన్ను మాత్రం మిస్సవలేదు. మనిద్దకి భగవంతుడు ఎప్పుడో రాసి పెట్టాడు. నీ మనసే నన్ను వెనక్కు లాక్కు వచ్చింది. ఇంక నీకేం భయంలేదు. అమ్మ కోరిక ప్రకారం ఈ నెల్లోనే నిన్ను నా దాన్ని చేసుకుంటాను."

హుషారుగా చెప్పుకుపోతున్న ఫణి వంక చూస్తూ తన్ను తాను గిల్లి చూసుకుంది. "మామయ్యా ఇది మాత్రం కల కాదు కదా?" అమాయకంగా అడిగిన స్వాతిని చటుక్కున దగ్గరకు లాక్కుని నుదుటిపై చిన్నగా ముద్దుపెట్టాడు ఫణి.

వదిలితే ఈ నిజం కలలా ఎక్కడ కరిగిపోతుందోనని గట్టిగా పెనవేసుకుపోయింది ఫణి.

ఇదంతా విని ఆనందంగా లోపలకు రాబోయిన వరలక్ష్మి ముసి ముసిగా నవ్వుకుంటూ ఇవతలకు వచ్చేసింది. ఆమె మనసు దూది పింజెలా గాల్లో ప్రయాణం చేస్తోంది. హాయిగా నిట్టూర్చి తన గదిలోకి వెళ్ళిపోయింది. ముహూర్తాలు ఎప్పుడు పెట్టించాలా అని ఆలోచిస్తోంది ఆవిడ. □